క్లుప్తంగా

మునిగిన పంటల పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

పూతలపట్టు: వర్షపు నీటి నిల్వలతో పంటపాలాలు మునిపోయాయని మండలంలోని పేట అగ్రహారం గ్రామాన్ని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ బుధ వారం సందర్శించారు. జాతీయ రహదారి పక్కన కొంత దూరం కాలువలు లేకపోవడంతో వర్షపు నీరు పక్కనున్న పంట పొలాల్లోకి రావడంతో రైతులు నష్టపోతున్నారు. సుమారు 50 ఎకరాల్లో పంట మునిగి రైతులకు నష్టం సంభవించింది. విషయం తెలుసుకున్న కలెక్టర్ పొలాలను పరిశీలించి, ఆర్అండ్‌బి, నేషనల్ హైవే అధికారులతో సంప్రదించి రోడ్డు పక్కన కాలువలు నిర్మించి నీటిని మళ్లిస్తా మని తెలిపారు. ఇన్ని రోజులు రైతులు తమ ఆవేదనలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎందు కు పట్టించుకోలేదని అధికారులపై మండిపడ్డారు. అధికారులు పట్టించుకోకపోతే నేరుగా తనను సంప్రదించాలని రైతులకు తెలియజేశారు. వీరి వెంట తహసీల్దార్ గుర్రప్ప, సీఐ కృష్ణమోహన్, నాయకులు దొరబాబు చౌదరి పాల్గొన్నారు.

55 మందికి వైద్య పరీక్షలు

ఐరాల: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై గ్రామీణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని చుక్కావారిపల్లెలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 55 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సారా స్వాధీనం

చిత్తూరు అర్బన్: సారా విక్రయిస్తున్న రూబెన్ (57) అనే మహిళను చిత్తూరు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు అరెస్టు చేశారు. గుడిపాల మండలంలో సీఐ సత్యనారాయణ తన సిబ్బందితో కలిసి బుధవారం తనిఖీలు నిర్వహించారు. నంగమంగళం వద్ద సారా విక్రయిస్తున్న రూబెన్ అనే మహిళ వద్ద 67 ప్యాకెట్ల సారాను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని అరెస్టు చేసి, న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా.. రిమాండుకు ఆదేశించడంతో చిత్తూరు జిల్లా జైలుకు తరలించారు.

వ్యక్తి ఆత్మహత్య

ఐరాల: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తాళంబేడువారిపల్లెకు చెందిన సుధాకర్(31) వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య చంద్ర యాదమరి మండలం మోర్థానపల్లెలో ఉంటుంది. ఈమెకు ఇద్దరు కుమారులు. కాగా 9 ఏళ్ల కిందట సుధాకర్, లక్ష్మీదుర్గాను రెండో వివాహం చేసుకున్నాడు. ఈమెకు ఇద్దరు కుమార్తెలు. దంపతులు తాళంబేడువారిపల్లెలో నివాసం ఉంటున్నారు. రెండు కుటుంబాల పోషణ భారం కావడంతో మద్యానికి బానిస అయ్యాడు. ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెందిన అతను పలుమార్లు చనిపోతాను అని చెప్పేవాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం రసాయనం సేవించి ఆటోలో తన ఇంటి వద్దకు వచ్చి కుప్పకూలిపోయాడు. వెంటనే అప్రమత్తమైన ఈయన రెండో భార్య లక్ష్మీదుర్గ అదే ఆటోలో బంధువుల సాయంతో జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. లక్ష్మీదుర్గ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సర్పంచ్‌కు సన్మానం

పూతలపట్టు: మండలంలోని బూసిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రహరీగోడను తన సొంత నిధులతో నిర్మించిన సర్పంచ్ వసంతమ్మను పాఠశాల యాజమాన్యం బుధవారం ఘనంగా సన్మానించింది. విద్యార్థులకు అండగా ఉండాలనే నేపథ్యంతో సుమారు 115 అడుగుల పొడవు, 90 అడుగుల వెడల్పు గల ప్రహరీ గోడను రూ.7.5 లక్షలకు నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు వాసుదేవన్, మధుసూదన్ రెడ్డి, మండల యూటీఎఫ్ అధ్యక్షులు నాగరాజు, ప్రధానోపాధ్యాయులు శ్వేత తదితరులు పాల్గొన్నారు.

టీకానే చిన్నారులకు రక్ష



తనిఖీ చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిన్నారులకు టీకానే రక్ష అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతి దేవి అన్నారు. చిత్తూరు నగరంలోని సత్యనారాయణపురం, టెలిఫోన్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఆమె బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చంటి బిడ్డలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించడం వల్ల ప్రాణాంతకరమైన వ్యాధులను దూరం చేయవచ్చన్నారు. అర్హులైన పిల్లలందరికీ టీకాలు వేయించాలని, గురువారం నుంచి ఇంటింటా క్యాన్సర్ సర్వేను విధిగా నిర్వహించాలని సూచించారు.

విద్యార్థుల్లో ఆలోచనాశక్తి..ప్రశ్నించుకునేతత్వం.. పరిశీలనాదృక్పథం..అపారం. వీటిని వినియోగించుకుంటే వారు మంచి శాస్త్రవేత్తలుగా ఎదుగుతారు. దేశాభివృద్ధిలో కీలకమైన వనరుగా మారుతారు. ఇదే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు కౌశల్-2024 వచ్చేసింది. విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న ఆలోచనలను వెలికి తీసి వారిని వెన్ను తట్టేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి (ఆప్కాస్ట్), భారతీయ విజ్ఞాన మండలి సంయుక్తంగా ప్రతిభాన్వేషణ పోటీలు ప్రతి ఏటా నిర్వహిస్తున్నాయి. ఈ పోటీల నిర్వహణపై సాక్షి కథనం.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ (ఫైల్)

సృజనకు మేలుకొలుపు

కౌశల్-2024 వచ్చేసింది

- 8 నుంచి 10 తరగతుల విద్యార్థులకు ప్రతిభాన్వేషణ పోటీలు
- రాష్ట్రస్థాయి విజేతలకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు
- ఈనెల 15 వరకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవకాశం

చిత్తూరు కలెక్టరేట్ : కౌశల్-2024 పోటీలకు సమయం ఆసన్నమైంది. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి గత ప్రభుత్వం ఎనలేని కృషి చేసింది. దీంతోపాటు ఆ స్కూళ్లలోని విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంది. అందులో భాగంగా సర్కారు బడుల్లో డిజిటల్ హంగులను సమకూర్చింది. ఈ క్రమంలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్(ఏఎఫ్‌పీ) స్మార్ట్ టీవీలతో విద్యార్థులకు బోధన చేస్తున్నారు. అలాగే జాతీయ ప్రమాణాలతో కూడిన సెంట్రల్ సిలబస్ బోధన పలు పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. తాజాగా ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి, ప్రోత్సహించడానికి కౌశల్-2024 పోటీలు నిర్వహణకు సన్నద్ధమవుతున్నారు. ప్రతిభాన్వేషణలో విద్యార్థులకు పాఠశాల, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఆన్‌లైన్‌లో పాఠశాల, జిల్లాస్థాయి పోటీలు, ఆఫ్‌లైన్‌లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్రస్థాయి పోటీలను డిసెంబర్ 29, 30 తేదీల్లో విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాలలో నిర్వహిస్తారు. ఈ పోటీల్లో భాగంగా కౌశల్ సైన్సు క్విజ్ పోటీలు, పోస్టర్ కాంపిటీషన్, వైజ్ఞానిక లఘు చిత్ర పోటీలు నిర్వహించనున్నారు. ఇందులో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతితోపాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికలు అందజేయనున్నారు.

కౌశల్ సైన్సు క్విజ్ పోటీ..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఈ పోటీలకు అర్హులు. ఇందులో ప్రతి తరగతి నుంచి ముగ్గురు మెరిట్ విద్యార్థులను మాత్రమే ఎంపిక చేస్తారు. వీరికి ఈ పోటీలు నిర్వహిస్తారు. పోటీలు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. క్విజ్, పోస్టర్ ప్రజంటేషన్ పోటీలు ఉంటాయి.

జిల్లా వివరాలు..

జిల్లాలోని ఉన్నత పాఠశాలలు	354
చదువుతున్న విద్యార్థులు	85,685
రిజిస్ట్రేషన్ కు ఆఖరి తేదీ	నవంబర్ 15
పాఠశాల స్థాయి పరీక్ష	నవంబర్ 20, 21, 22
జిల్లాస్థాయి పరీక్ష	డిసెంబర్ 6
రాష్ట్రస్థాయి పరీక్ష	డిసెంబర్ 29, 30

బహుమతులు..

క్విజ్ పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతికి రూ.4500, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి రూ.15 వేలు, ద్వితీయ బహుమతి రూ.12 వేలు, తృతీయ బహుమతి రూ.9 వేలు ప్రదానం చేశారు. అలాగే రాష్ట్ర స్థాయిలో కన్సొలేషన్ బహుమతులు రూ.6 వేలు చొప్పున నగదు బహుమతి అందిస్తారు. పోస్టర్ కాంపిటీషన్ పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి సాధిస్తే రూ.1500, ద్వితీయ బహుమతి రూ.వెయ్యి, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన విజేతలకు రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.2 వేలు అందజేస్తారు. అలాగే రాష్ట్ర స్థాయిలో కన్సొలేషన్ బహుమతులు రూ.1500 చొప్పున నగదు బహుమతి అందిస్తారు. జిల్లా, రాష్ట్రస్థాయి లో గెలుపొందే ప్రతిభావంతులకు జ్ఞాపిక, ధ్రువపత్రం అందజేస్తారు.

సిలబస్, రిజిస్ట్రేషన్ ఇలా..

ప్రభుత్వ రంగ పాఠశాలల్లో 8, 9, 10 తరగతులకు సంబంధించి గణితం, విజ్ఞానశాస్త్రం, సాంఘికశాస్త్రం, విజ్ఞానశాస్త్ర రంగంలో భారతీయ శాస్త్రవేత్తల కృషి అనే అంశాలకు సంబంధించి ఇప్పటి వరకు జరిగిన సిలబస్ పరిధిలో చదువుకోవాల్సి ఉంటుంది. విద్యార్థులు వ్యక్తిగతంగా పాఠశాలల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్‌ను ఈ నెల 15వ తేదీ లోపు పాఠశాలల కోఆర్డినేటర్లు www.bvmap.orgలో ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ పూర్తి అయిన తర్వాత ఆన్‌లైన్ విధానంలో పాఠశాల స్థాయిలో ఈ నెల 20, 21, 22 తేదీల్లో, జిల్లాస్థాయిలో డిసెంబర్ 6వ తేదీన, రాష్ట్ర స్థాయిలో డిసెంబర్ 29, 30 తేదీల్లో పోటీలు నిర్వహిస్తారు.

విద్యార్థులకు మంచి అవకాశం



జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మంచి అవకాశం. కౌశల్ పోటీలు ప్రతి ఏడాది నిర్వహిస్తారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు తమ ప్రతిభను పరీక్షించుకోవచ్చు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పోటీలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపడుతున్నాం. -వరలక్ష్మి, డీఈఓ, చిత్తూరు

సృజనాత్మకత వెలికితీతకే..



విద్యార్థులోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఏటా కౌశల్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే. ఈ విద్యాసంవత్సరం నిర్వహిస్తున్న పోటీల్లో ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనేలా అవగాహన కల్పిస్తున్నాం. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని గెలుపొందే విద్యార్థులకు నగదు, ధ్రువపత్రాలు, జ్ఞాపికలను అందజేస్తారు. పోటీలు ఆన్‌లైన్ విధానంలో మాత్ర మే నిర్వహిస్తారు.

- దామోదర్‌రెడ్డి, కో-ఆర్డినేటర్, కౌశల్, చిత్తూరు

విద్యార్థినికి సన్మానం



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ మనోహర్

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని కుమారి వెస్టన్ ఒకల్ సోలో పోటీల్లో ప్రతిభ చాటిందని ప్రిన్సిపల్ మనోహర్ అన్నారు. ఆ కళాశాలలో బుధవారం విద్యార్థినికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ తిరుపతి జిల్లా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో నవంబర్ 8, 9, 10 తేదీల్లో అంతర కళాశాలల యువజన ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో తమ కళాశాల తరపున పాల్గొన్న విద్యార్థిని కుమారి ప్రథమ బహుమతి సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఏఎం నరేంద్ర, కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఉషారాణి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ షమ్స్ అక్తర్, తెలుగు అధ్యాపకులు ధర్మమూర్తి, చరిత్ర అధ్యాపకులు డాక్టర్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవం



హోమపూజ నిర్వహిస్తున్న అర్చకులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో బుధవారం పవిత్రోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో విశేష సంధి, రెండవ కాలపూజ, మండలేశ్వర పూజ, ప్రత సమర్పణ, గంధ పవిత్ర సమర్పణ, మూడవ కాల పూజ, విశేష ద్రవ్యాహుతి, లఘుపూర్ణాహుతి పూజలను శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

గ్రామీణులకు ఉచిత వైద్యం

తవణంపల్లె: గ్రామీణులకు అందిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు వినయ్‌కుమార్, కేశవనారాయణ తెలిపారు. మండలంలోని వెంగంపల్లె, కొండ్రాజుకాలువలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించి 80 మందికి వైద్యసేవలందించారు.

మంగళ విద్యావాణి 30వ సంచిక ఆవిష్కరణ



మంగళవిద్యావాణి సంచికను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

బంగారుపాళెం: మండలంలోని మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మంగళ విద్యావాణి 30వ సంచికను హెచ్ఎం రాజ్యలక్ష్మి అధ్యక్షతన ఆవిష్కరించారు. సంచిక ముద్రణకు మండలంలోని నలగాంపల్లెకు చెందిన పారిశ్రామికవేత్త ధరణిప్రసాద్, చెన్నైకి చెందిన మధుసూదన్ దాతలుగా వ్యవహరించారు. హెచ్ఎం మాట్లాడుతూ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సంబంధించి ప్రత్యేక విద్యా మాసపత్రికను నడపడం చాలా సంతోషమని పేర్కొన్నారు. సహృదులైన దాతల సహకారంతో ఇప్పటి వరకు 30 సంచికలను ఆవిష్కరించడం సంతోషమన్నారు. పూర్వపు ప్రధానోపాధ్యాయురాలు లలిత మాట్లాడుతూ, రాష్ట్రంలో ఏ పాఠశాలలోనూ ఇలాంటి మాస పత్రికను నడపడం లేదని అన్నారు. 2018లో ఈ సంచిక తన ఆధ్వర్యంలో ప్రారంభమైందని గుర్తుచేశారు. విద్యార్థుల్లో రచనాశక్తిని పెంపొందిం చేందుకు ఇలాంటి విద్యా మాసపత్రికలు తోడ్పడుతాయన్నారు. మంగళవిద్యావాణి సంచిక గణిత ఉపాధ్యాయుడు అరుణ్‌శివప్రసాద్ కృషి ఎంతో ఉందని అభినందించారు. విశ్రాంత ఉపాధ్యాయులు మోహన రామలింగం, అమరనాథరెడ్డి సంచిక అభివృద్ధిపై ప్రస్తావించారు. గణిత ఉపాధ్యాయుడు అరుణ్‌శివప్రసాద్ మాట్లాడుతూ, దాతల సహకారం, విద్యార్థుల ఉత్సాహం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రమాదేవి సంజీవి, భారతి, పిళ్లారప్ప, సంపంగి, మోహన్‌రెడ్డి, ధన శేఖర్, ప్రేమకృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నగరంలో ఒక వర్గంపై మరో వర్గం దాడి



చిత్తూరు పోలీస్ స్టేషన్ వెలుపల బాధితులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ఓ వర్గంపై మరో వర్గం దాడికి పాల్పడింది. బాధితుల కథనం మేరకు.. బుధవారం చిత్తూరు నగరంలోని పీసీఆర్ కూడలి నుంచి కొందరు కరపత్రాలు పంచుతూ పలమనేరు రోడ్డులో వెళ్తున్నారు. వారిని చూసిన, మరో వర్గానికి చెందిన వ్యక్తులు ఎక్కడకు వెళ్తున్నారని ప్రశ్నించారు. తాము మందిరానికి వెళ్తున్నామని చెబుతుండగా.. మీకు ప్రచారం చేయడానికి అనుమతి ఉందా? ఇంతమంది ఎందుకు గుంపుగా వెళ్తున్నారు? అసలు మీ బ్యాగుల్లో ఏముంది? అంటూ వారితో వాగ్వాదానికి దిగారు. ఇంతలో ముగ్గురు వ్యక్తులు వారిపై పిడిగుద్దులు కురిపించారు. అనుమతి లేకుండా రోడ్లపైకి ఎలా వస్తారు? ప్రచారం చేస్తారా? అంటూ మొహంపైనే కొట్టారు. అప్పటికీ మౌనంగా వెళ్లిపోతున్న వారిని, పోలీసులకు చెప్పి స్టేషన్‌కు పిలిపించారు. పోలీసుల ఎదుటే వారిని, వారితో ఉన్నవారిని నానా బూతులు తిట్టారు. విషయం అప్పటికే నగరం మొత్తం వ్యాపించడంతో పలు సంఘాలకు చెందిన వారు, ఇరువారం కార్పొరేటర్ అశోక్‌కుమార్, రిటైర్డ్ డీఎస్పీ అమర్‌నాథ్ ఫ్రెడ్రిక్స్ తదితరులు పెద్ద ఎత్తున చిత్తూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. తాము ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘిస్తే పోలీసులు ప్రశ్నించాలి తప్ప.. ఇలా రోడ్డుపై దాడి చేసి, పోలీస్ స్టేషన్‌లోనే బూతులు తిట్టడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. అన్నదమ్ముల్లా ఉన్న చిత్తూరు ప్రజల మధ్య వర్గాల చిచ్చు పెట్టొద్దని సూచించారు. అనంతరం ఇరువర్గాల వారికి టూటౌన్ సీఐ నెట్టికంఠయ్య నచ్చజెప్పడంతో రాజీ పడి వెళ్లిపోయారు.

ఆలయ భూముల వేలం

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయ మాన్యం భూముల కౌలు వేలం ద్వారా రూ.1.29 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈఓ మునిరాజు తెలిపారు. బుధవారం నిర్వహించిన అ వేంలో పరిసర గ్రామాల నుంచి పలువురు రైతులు వచ్చి పాల్గొన్నారు. మొగిలి, టేకుమంద, ఊటువంక, 170 గొల్లపల్లె గ్రామాల్లో మొగిలీశ్వరస్వామి వారి ఆలయ భూములు ఉన్నాయి. ఈ భూముల్లో రైతులు మూడేళ్ల లీజు పద్ధతి ద్వారా పంటలు సాగుచేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త విజయకుమార్, ఇన్‌స్పెక్టర్ శశికుమార్ పాల్గొన్నారు.

17న మండల సమావేశం

బంగారుపాళెం: మండల సర్వసభ సమావేశం ఈ నెల 17వ తేదీ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీధర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. దీనికి ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, మండల అధికారులు, గ్రామ కార్యదర్శులు హాజరు కావాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఐరాల: మండలంలోని అగరంపల్లె జెడ్పీ హైస్కూల్‌లో జీవశాస్త్రం ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న సురేంద్రబాబు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న సందర్భంగా బుధవారం పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం సురేష్‌బాబు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఇన్‌చార్జి హెచ్ఎం మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం 2024-25 విద్యా సంవత్సరానికి ఉత్తమ ఉపాధ్యాయుడిగా విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా సురేంద్రబాబు అవార్డు అందుకోవడం ఆనందకరమని తెలిపారు. అవార్డు గ్రహీత మాట్లాడుతూ ఈ అవార్డు రావడానికి సహకరించిన ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో నిరంతరం అన్వేషణ పరిజ్ఞానంతో ముందుకు వెళ్లి ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు, ఉపాధ్యాయులు శాంతాదేవి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

సెలవుల్లో ఎంపీడీఓ.. ఇన్‌చార్జ్ ఎక్కడా?

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు ఎంపీడీఓ శ్రీనివాసులు 15 రోజుల పాటు సెలవులో వెళ్లారు. సెలవుల్లోకి వెళ్లి ఇప్పటికి వారం రోజులవుతోంది. అయినా ఇన్‌చార్జ్ బాధ్యతలు ఎవరికి ఇవ్వలేదు. దీని కారణంగా మండలంలో జరగాల్సిన సర్వేలు కుంటుపడుతున్నాయి. ఎంపీడీఓ సెలవుల కారణంగా అధికారులు, సిబ్బంది ఆ సర్వేలను సైతం పట్టించుకోకుండా వదిలేశారు. మండలంలో సమస్యలు పుట్టుకొస్తున్నాయి. వాటి కట్టడికి పంచాయతీ స్థాయిలో కాకపోగా, మండల స్థాయిలో పరిష్కారమవుతుందని ఆశించిన ప్రజలు, ప్రజాప్రతినిధులకు ఎంపీడీఓ లేకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. దీనిపై ఈవోపీఆర్డీని పరశురాంను వివరణ కోరగా, ఎంపీడీఓ సెలవుల్లోకి వెళ్లారు.. రెండు, మూడు రోజుల్లో విధుల్లోకి వస్తారు. ఇన్‌చార్జ్ ఎవరికీ ఇవ్వలేదని బదులిచ్చారు.

18న సచివాలయాల ఎదుట నిరసన



మాట్లాడుతున్న నాగరాజన్

చిత్తూరు కార్పొరేషన్: అధికారంలో వస్తే పేదలకు ఇళ్ల స్థలాలు, రుణాలు ఇస్తామని కూటమి ప్రభుత్వ హామీ నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ డిమాండ్ చేశారు. చిత్తూరులో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పట్టణ ప్రాంతాల్లో 2 , గ్రామీణ ప్రాంతాల్లో 03 సెంట్లు ఇళ్ల స్థలాలు కేటాయించి, నిర్మాణానికి 5 లక్షల రూపాయలు మంజూరు చేస్తామని హామీనిచ్చారన్నారు. ఆ హామీ నెరవేర్చాలని జిల్లాలోని సచివాలయాల ఎదుట నవంబరు 18న నిరసన కార్యక్రమాలు చేయనున్నమన్నారు. జిల్లా వ్యాప్తంగా తలదాచుకోవడానికి ఇళ్లు లేకుండా నిరుపేదలు అద్దె ఇంటిలో కొనసాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హత ఉన్నప్పటికీ రాజకీయాల కారణంగా మంజూరు చేయకపోవడంతో నిరుపేదలు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతిఒకరికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా డిపాజిట్ చెల్లించినవారికి టిడ్కో గృహాలను కేటాయించాలని తెలిపారు. ఇంధన సర్దుబాటు చార్జీతో పెంచిన విద్యుత్ చార్జీలను సామాన్య మధ్య తరగతి ప్రజలపై భారం లేకుండా ప్రభుత్వమే భరించాలని వివరించారు. కార్యక్రమంలో నాయకులు మణి, విజయ్‌కుమార్, వేలన్, రామమూర్తి, విజయ్ గౌరి, జమీలాభి, రమాదేవి, కుమారి, కవిత తదితరులు పాల్గొన్నారు.

19 మందికి ఏఓలుగా ఉద్యోగోన్నతులు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలోని జిల్లాపరిషత్ పరిధిలో పనిచేస్తున్న 19 మంది సీనియర్ సహాయకులకు ఏఓలుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ సీఈఓ రవికుమార్‌నాయుడు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. మురళీధర్‌రెడ్డి, మధువాణి, మునిరాజా, శివయ్య, గుల్షాద్‌బేగం, జయప్రకాష్, జనార్థన్, రవీంద్రనాథ్, భువనేశ్వరి, గంగాధర్, కవిత, కుమార్, సునీల్‌కుమార్, బాలకృష్ణ, సుమజ, మోతల్, మదనమోహన్‌రాజు, జ్యోతిలతకు ఉద్యోగోన్నతి కల్పిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రేపటిలోపు ధ్రువీకరణ పత్రాలు అందించాలి

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు, తిరుపతి జిల్లాలోని డీఎస్సీ-2018 పీఈటీ అభ్యర్థులు ఈ నెల 15 వ తేదీలోపు ధ్రువీకరణపత్రాలు అందజేయాలని డీఈఓ వరలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ డీఎస్సీ 2018 పీఈటీ అభ్యర్థులు స్పోర్ట్స్ కోటాలో దరఖాస్తు చేసి, పరిశీలన పూర్తి అయిన వారు వెంటనే ధ్రువీకరణ పత్రాలు అందజేయాలన్నారు. ఫారం 2,3,4ను తమ ఫొటోలతో కూడిన క్రీడా ధ్రువీకరణపత్రాలను సంబంధిత అధికారి చేత అటిస్టేషన్ చేయించుకుని డీఈఓ కార్యాలయంలో అందించాలని సూచించారు.

శిక్షణలో పట్టు పెంచుకోవాలి



తుపాకీ శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ కేడెట్లు

చిత్తూరు కలెక్టరేట్: ఎన్‌సీసీ విద్యార్థులు క్యాంప్‌లో నిర్వహించే శిక్షణలో కేడెట్లు పట్టు పెంచుకోవాలని 35 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ నోయల్ వివేక్ మోనిస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు మైదానంలో నిర్వహిస్తున్న క్యాంప్‌లో బుధవారం ధ్యానంపై అవగాహన, ఆయుధ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ధ్యానంతో దేహంలోని మలినాలను ఏ విధంగా తొలగించుకోవచ్చో క్షుణ్ణంగా తెలియజేశారు. సుబేదార్ మహేష్‌బాబు మాట్లాడుతూ తుపాకీ శిక్షణలో మెలకువలను ప్రతి కేడెట్ తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు ప్రసాద్‌రెడ్డి, బాలాజీ, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు, తిరుపతి ఏఎస్పీల నియామకం

చిత్తూరు అర్బన్: చిత్తూరు, తిరుపతి పోలీసు జిల్లాలకు ఏఎస్పీలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి కుమార్ విశ్వజీత్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న కె.జనార్ధన్ నాయుడును తిరుపతి ట్రాన్స్‌కో ఏఎస్పీగా, అన్నమయ్య జిల్లాలో పనిచేస్తున్న ఎస్ఆర్.రాజశేఖర్ రాజును చిత్తూరు ఏఎస్పీగా నియమించారు.

గంజాతో పట్టుబడిన విద్యార్థి

చిత్తూరు అర్బన్: గంజా తీసుకెళ్తున్న డిగ్రీ చదివే ఓ విద్యార్థిని చిత్తూరు పోలీసులు అరెస్టు చేశారు. టూటౌన్ ఎస్ఐ ప్రసాద్ కథనం మేరకు.. బుధవారం నగరంలోని కాణిపాకం బైపాస్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. రవితేజ (22) అనే యువకుడి బ్యాగులో పోలీసులకు గంజాయి దొరికింది. ఇతను బాలాజీ నగర్ కాలనీకి చెందిన వ్యక్తిగా, చిత్తూరులోని ఓ డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదవుతున్నట్లు గుర్తించారు. నిందితుడి వద్ద ఉన్న రెండు కిలోల గంజాయిను స్వాధీనం చేసుకుని, అరెస్టుచేసి మేజిస్ట్రేట్ ఆదేశాలతో చిత్తూరు జిల్లా జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.